## నేడు బండ్లగూడలో వన మహోత్సవం

బండ్లగూడ, జూన్ 29: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యాక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. పీఅండ్‌టీకాలనీలో ఆదివారం ఉదయం డివైడర్‌పై మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జూలై 1న మహిళా ఆరోగ్యంపై అవగాహన రన్

ఖైరతాబాద్, జూన్ 29: మహిళా ఆరోగ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని అమ్మని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 1న నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద అవగాహన 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆమని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్లను ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు భారతి, కోశాధికారి యమున, సహాయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సామాజికవేత్త కుసుమ భోగరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రన్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, విద్యాశాఖ ప్రినిస్పాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం హాజరవుతున్నారని తెలిపారు.

## మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మృతి తీరనిలోటు

హిమాయత్‌నగర్, జూన్ 29: మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ రాథోడ్ మృతి సమాజానికి తీరనిలోటని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ తుదిశ్వాస వరకు సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో సైతం కీలక పాత్ర వహించారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సంక్షేమం

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- యూసుఫ్‌గూడలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ రాజ్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, జూన్ 29: పేదల సంక్షేమమే పరమావధిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేసిందని బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి ఖైరతాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్, షేక్‌పేట్ తహసీల్దార్లు నయీముద్దీన్, వై.అనితారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 531 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ లబ్ధిదారులకు ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, సీఎన్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ ప్రతినిధి హబీబా సుల్తానాతో కలిసి 531 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. షేక్‌పేట్ రెవెన్యూ మండల పరిధిలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ పరిధిలో 136, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్‌కు చెందిన 59 మందికి బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ వై.అనితారెడ్డితో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఖైరతాబాద్ రెవెన్యూ మండల పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 336 మంది లబ్ధిదారులకు ఖైరతాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ నయీముద్దీన్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

## ప్రభాకర్‌రెడ్డి సేవలు అభినందనీయం



ఆర్టీసీ కార్మిక నాయకుడు ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న డిపో మేనేజర్ శ్రీనాథ్

బండ్లగూడ, జూన్ 29: ఆర్టీసీ ఎద్దుల ప్రభాకర్‌రెడ్డి సేవలు అభినందనీయమని రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. మూడున్నర దశాబ్దాల పాటు ఆర్టీసీలో కార్మికుడిగా, నాయకుడిగా సేవలందించిన ప్రభాకర్‌రెడ్డి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపోలో కార్మికులు ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. మేనేజర్ శ్రీనాథ్ ఆయనను ఘనంగా సన్మానించారు. శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి కార్మికుల పక్షాన నిలిచి అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుశీల, కార్మికులు అంజయ్య, అనంతయ్య, రామకృష్ణ, ఎస్‌ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి సేవ చేయడం అదృష్టం



డాక్టర్ సుధారాణిని సన్మానిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 29: దేశానికి అన్నం పెట్టే రైతుకు ప్రత్యక్ష, పరోక్షంగా సేవ చేయడం మనం అదృష్టంగా భావించాలని, రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న వారిని సన్మానించారు. వారు అనుక్షణం, అంకిత భావం, నిజాయితీతో పనిచేరని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ, విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ వి.సుధారాణి, ఆఫీస్ సబార్డినేట్ వి.అశోక్‌లకు వీడుకోలు సమావేశం ఏర్పాటు చేశారు. వారు అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

హిమాయత్‌నగర్, జూన్ 29: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ చైర్మన్ మణికొండ ప్రార్థన, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సల్లా ప్రసాద్, సందీప్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో స్పోర్ట్స్ అకాడమీ ప్రశంసా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రార్థన, అతిథులు మాట్లాడుతూ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలని అన్నారు. స్వయం క్రమశిక్షణతో క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పోటీ ప్రపంచంలో క్రీడా రంగంలో ప్రతిభచాటిన వారికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అనంతరం క్రీడరంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు అందజేసి, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రామాంజుల, ప్రధానోపాధ్యాయులు ఫమిదా, సీహెచ్ రేఖారావు, ఫాతిమాఖాజీం, కరస్పాండెంట్ కె.ప్రభాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రశంసా ప్రతాలు అందజేస్తున్న చైర్మన్ ప్రార్థన

## భోజన కేంద్రం ఏర్పాటు చేయాలి



రూ.5ల భోజన కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శంషాబాద్ రూరల్, జూన్ 29: శంషాబాద్‌లో రూ.5ల భోజన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం శంషాబాద్ సీపీఐ మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో కార్మికుల సంఖ్య భారీగా పెరుగుతుందన్నారు. కూలీలుగా భవన నిర్మాణంతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు తక్కువ ఖర్చుతో ఉండే భోజనం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి భోజన కేంద్రం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ప్రభుముదిరాజ్, రాచమల్ల యాదగిరి ఉన్నారు.

## అధికారుల తీరుపై గ్రామస్తుడి ఆగ్రహం

**కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదని ఆవేదన**



కార్పొరేషన్ కార్యాలయంలో అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హైదర్షాకోట్ గ్రామస్తుడు

బండ్లగూడ, జూన్ 29: కోర్టు స్టే ఇచ్చినా కూడా తమ స్థలంలో అక్రమ భవన నిర్మాణానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని హైదర్షాకోట్ గ్రామస్తుడు భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోకి వచ్చి హంగామ సృష్టించాడు. ఆయన మాట్లాడుతూ హైదర్షాకోట్ గ్రామంలో సర్వే నంబర్‌లో 42/3 ఉన్న తమ స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణం చేస్తున్నరని వాపోయారు. ఆ విషయంలో భవన నిర్మాణం నిలిపివేయాలని కోర్టు కమిషనర్‌కు ఆదేశాలు చేసిందన్నారు. కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. పనులు ఆపకపోతే అధికారుల తీరుపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు సైతం అధికారులు వచ్చిన అనంతరం మాట్లాడుదామని భాస్కర్‌రెడ్డికి నచ్చజెప్పారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నారాయణగూడలోని మెల్కోటే పార్కు ఆవరణలో బీపీ చెకప్ చేస్తున్న వైద్యసిబ్బంది

హిమాయత్‌నగర్, జూన్ 29: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో దోహద పడతాయని కాంగ్రెస్ నేత జి.రామన్‌గౌడ్ అన్నారు. వాసవి దవాఖాన సౌజన్యంతో శనివారం నారాయణగూడలోని మెల్కోటే పార్కులో వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షుగర్, బీపీ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్కు సభ్యులు భరద్వాజ్, కాంగ్రెస్ నాయకులు జక్కి, జైస్వాల్, సాయి పాల్గొన్నారు.

## వాసవి హాస్పిటల్ ఎదుట ధర్నా

ఖైరతాబాద్, జూన్ 29: ఖైరతాబాద్‌లోని వాసవి ఆస్పత్రి ఎదుట ఓ వ్యక్తి మృతదేహంతో ధర్నా నిర్వహించారు. అతడి మృతికి యాజమాన్యమే కారణమంటూ బంధువులు ఆరోపించారు. ఈ ఘటన ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లక్డీకాపూల్‌లోని వాసవి ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో కార్డియాలజీ నిర్వహిస్తున్నారు. ఈ విభాగం పెట్టుకున్నందుకు గాను ఆస్పత్రికి ప్రతినెలా ఆ విభాగం కొంత మొత్తం చెల్లిస్తోంది. అయితే ఆ విభాగంలో క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యానగర్‌కు చెందిన కనకారెడ్డి పనిచేస్తున్నాడు. శుక్రవారం విధుల్లోకి వచ్చిన కనకారెడ్డి మద్యం సేవించి వచ్చాడని, సదరు యాజమాన్యం ఇంటికి పంపించింది. ఇదిలా ఉండగా, విద్యానగర్ ఫ్లైఓవర్ కింద కనకారెడ్డి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో ఆయన మృతికి కార్డియాలజీ విభాగం యాజమాన్యమే కారణమంటూ ఆరోపిస్తూ మృతదేహంతో బంధువులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. కనకారెడ్డి మద్యం సేవించి వచ్చాడని, ఇంటికి పంపిస్తున్నామంటూ కుటుంబ సభ్యులకు ముందస్తుగా యాజమాన్యం మేసేజ్ పెట్టడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను శాంతింప జేయడంతో ఆందోళన విరమించారు. కార్డియాలజీ విభాగం తమ దవాఖానలోనిది కాదని, ఔట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహిస్తున్నారని ఆస్పత్రి ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు నల్లకుంట పోలీసు స్టేషన్‌లో నమోదైందని, పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

## అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు



ఎన్‌బీటీనగర్‌లో ప్రధాన రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

జూబ్లీహిల్స్, జూన్ 29: ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లో శనివారం ప్రధాన రోడ్డు పనులను పరిశీలించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## హామీని విస్మరించిన ముఖ్యమంత్రి

ఖైరతాబాద్, జూన్ 29: నేతకాని సామాజికవర్గానికి సముచిత స్థానం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తమను విస్మరించారని తెలంగాణ నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో 20లక్షలకు పైగా నేతకానిలు ఉన్నారని అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తమకు కాంగ్రెస్ చేయిచ్చిందని, ఒక్కసీటు కూడా కేటాయించలేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ పదవీ అయిన ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు వెనుకాడమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ జూలై 1న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు.



నిమ్స్‌లో పలువురు ఉద్యోగులు శనివారం పదవీ విరమణ పొందారు. ఆస్పత్రిలోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11 మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగులను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సత్కరించారు. వీరిలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ద్రాహాయిని, స్టాఫ్ నర్సులు షహీన, ఎస్తేర్, కుమారి, పీటర్, కిషన్‌రావు తదితరులు ఉన్నారు. – ఖైరతాబాద్

## బోరబండ బస్ టెర్మినల్ మురుగుమయం



బోరబండ బస్ టెర్మినల్ వద్ద ప్రధాన రహదారిపై మురుగు పరుగు

ఎర్రగడ్డ, జూన్ 29: బోరబండ బస్ టెర్మినల్ మీదుగా ప్రధాన రహదారిపై మురుగు ప్రవాహం నిలయంగా మారింది. నిత్యం ఇదే దుస్థితి. పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీల కారణంగా ఈ పరిస్థితి తలెత్తుతున్నది. బస్ టెర్మినల్ పరిసర ప్రాంతంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లటానికి జంకే పరిస్థితి దాపురించింది. మురుగును భరించలేక సమీపంలోని ఇరుకు మార్గాల గుండా రాకపోకలు సాగిస్తున్నారు. బల్దియాతో పాటు ఇతర శాఖల సిబ్బంది, అధికారులు తరచూ ఇక్కడి నుంచే వెళ్తుంటారు. సమస్యను మాత్రం పట్టించుకోరు. రెండు.. మూడు నెలలకోసారి తూతూ మంత్రంగా లీకేజీలకు మరమ్మతు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పార్టీలు మారితే ప్రజలే బుద్ధి చెప్పాలి

శంషాబాద్ రూరల్: పార్టీలు మారే ఎమ్మెల్యేలకు ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ చేరడం చాలా దుర్మార్గమని అన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ పార్టీలు మారే నాయకులకు ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పాలని కోరారు. అధికారం కోల్పోయి కష్టాల్లో ఉన్న బీఆర్‌ఎస్‌ను వదిలి వేరే పార్టీలోకి మారే నాయకులను మరోసారి బీఆర్‌ఎస్‌లోకి తీసుకోవద్దని కోరారు. ఉద్యమంలో అనేక కష్టాలు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్‌కు నాయకులను తయారు చేసే సత్తా ఉందన్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులను ఎన్నికల సమయంలో తగ్గిన బుద్ధి చెప్పాలని ప్రజలను ఈ సందర్భంగా కోరారు.

## భవిష్యత్తు మొత్తం 'ఏఐ'దే

**కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్**



నమూనాలను పరిశీలిస్తున్న కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్

వెంగళరావునగర్ జూన్ 29: భవిష్యత్తు మొత్తం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగానిదే (ఏఐ) అని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌పోజెనిక్స్–24 పేరుతో ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజంలో ఏ రంగంలో చూసినా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉందని అన్నారు. రోజు రోజుకు టెక్నాలజీ మారిపోతున్నదని, తదనుగుణంగా విద్యార్థులు అప్‌డేట్ కావాల్సిందేనని అన్నారు. ఎక్స్‌పోలో కళాశాలకు చెందిన 76 బృందాలు పాల్గొన్నట్లు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్ తెలిపారు. లాట్ సెన్సార్స్, ఏఆర్–వీఆర్, టెలిమెడిసిన్, ఫిన్‌టెక్‌లతో పాటు పలు రకాల టెక్నాలజీ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ మీర్ అక్బర్ అలీఖాన్, డాక్టర్ ఫర్హతుల్లా హుస్సేని, ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్, ప్రొఫెసర్ ఉమ ఎన్ దుల్హాదే, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ ఖాజా అహ్మద్



ఖాజా అహ్మద్

హిమాయత్‌నగర్, జూన్ 29: టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఖాజా అహ్మద్ నియమితులయ్యారు. లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శనివారం ఖాజా అహ్మద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ న్యాయపరమైన అంశాల్లో కీలకంగా ఖాజా అహ్మద్ వ్యవహరించారని అశోక్‌గౌడ్ తెలిపారు. తనపై నమ్మకంతో లీగల్ సెల్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి ఖాజా అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

## అవినీతి అనేది కేవలం ఆరోపణలు మాత్రమే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్రపురి సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్

మణికొండ, జూన్ 29: తనపై, తన తోటి కమిటీ సభ్యులపై వచ్చింది కేవలం ఆరోపణలు మాత్రమేనని, తాము ఎటువంటి అవినీతికి పాల్పడలేదని చిత్రపురి సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అన్నారు. ఇటీవల సొసైటీలో అవినీతి ఆరోపణలతో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన ఆయన కమిటీ సభ్యులతో కలిసి శనివారం చిత్రపురికాలనీ సొసైటీ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సున్నితమైన సమస్యను వివాదంగా చూడొద్దని, గత కమిటీల నిర్ణయాల వల్ల జరిగిన నష్టాలను మాకు అంటగడుతున్నారన్నారు. తాము పూర్తిగా బైలా, చట్ట ప్రకారం నిర్ణయాలు తీసుకున్నామన్నారు. త్వరలో జనరల్ బాడీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆ సమావేశానికి తప్పని సరిగా సభ్యులు హాజరుకావాల్సిందిగా కోరుతున్నామన్నారు.